దగ్గరకు వెళ్ళాలనిపిస్తుంది గానీ ఇలాంటి ఇరుకు కొంపల్లో మగ్గుతున్న వాళ్ళని పరామర్శించాలని ఎందుకుంటుంది లెండి!"[53]

***"పైచేయి"*** కథలోని ఎత్తుగడ కూడా ఇతివృత్తాత్మకంగానే ఉంది.

"ఎవరో చెప్పారంటూ మూర్తి ఫోనులో చెప్పిన వార్తకు నిశ్చేష్టుడినయ్యాను! పరమేశం తన కొంపాగోడూ, పొలం పుట్రా... అలా ఎక్కెడెక్కడో వున్న ఆస్తులన్నింటిని తెగనమ్ముకుని చివరికి ఎవరి పొలాల్లోనో పని చేసుకుంటూ కాలంవెళ్ళబుచ్చుతున్నాడట"[54]

***"విమల-ఆనందరావు"*** కథలోని ఎత్తుగడను పరిశీలిస్తే-

"చదివిన వీక్లీని పక్కన పెట్టేస్తూ గట్టిగా నిట్టూర్చింది విమల. ఆ వీక్లీలోని ఒక కథలో... నూటికి తొంభై మంది మగవాళ్ళ భార్యల ఇష్టాయిష్టాలను పట్టించుకోకుండా నిరంకుశంగా ప్రవర్తిస్తారని రచయిత్రి తన కలాన్ని నొక్కివక్కాణించింది."[55]

## 4.4.5 హాస్యముతో కూడుకొన్న ఎత్తుగడ :

కొన్ని కథల్లో ఎత్తుగడలు హాస్యంతో కూడుకొని ఉంటాయి. ఇటువంటి ఎత్తుగడలు చదివినపుడు పాఠకుడు కడుపుబ్బా నవ్వుకుంటాడు. కొందరు కథకులు ఇటువంటి ఎత్తుగడలో సిద్ధహస్తులుగా ఉంటారు. కథాంశం ఏకోవకు చెందినదైనా "ఎత్తుగడ" హాస్యంతో ప్రారంభించుట వల్ల పాఠకునికి కథ పట్ల మరింత ఆసక్తిని కలిగిస్తుంది. గోగినేని మణి గారి రచనల్లో కొన్ని ఎత్తుగడలు హాస్యంతో కూడుకొని ఉన్నాయి. వాటిలో ప్రధానంగా

***"అపోహ"*** కథలోని ఎత్తుగడ ఈ విధంగానే సాగింది

"ఫోన్ మోగితే తీశాను. అక్కయ్య చేసింది. "తమ్ముడూ... నవీనకి మంచి సంబంధం వచ్చింది. అబ్బాయికి తండ్రి లేడు..." అంటూ చెబుతోంటే, మధ్యలో అడ్డుపడి "తండ్రి లేకపోతే మంచి సంబంధమా?" అన్నాను సరదాగా.

---

**53. మొగలిపువ్వు కథా సంపుటి - గోగినేని మణి - పుట 78**

**54. పిచ్చుకగూడు కథాసంపుటి - గోగినేనిమణి - పుట 141**

**55. పిచ్చుకగూడు కథాసంపుటి - గోగినేనిమణి - పుట 157**

"అబ్బా అది కాదురా... మంచి సంబంధం అంటూ వివరాలు చెప్పే హడావుడిలో వరసక్రమం మారి వెనకది ముందు చెప్పేశాలే! రవ్వంత తప్పు దొర్లినా ఊరుకోవు కదా... పట్టేసుకుంటావు.."[56] అంటూ చిన్నగా నవ్వింది.

***"ట్రేడ్ సీక్రెట్"*** కథలో ఎత్తుగడ కూడా హాస్యంతో కూడుకొని ఉన్నదే.

"వంటగది నుంచి వీధి గమ్మం దగ్గరకూ, మళ్ళీ అక్కడ నుంచి వంటగదికీ తిరుగుతున్న సుజాతని ముందు గదిలో కూర్చుని పేపరు చదువుకుంటున్న శేషగిరి "స్కోరెంత? ఇంకా ఎన్ని రన్స్ చేయాలి...?" అనడిగాడు.

సుజాత అతని వేపు చిరాగ్గా చూసి "పొద్దున్నే ఏమిటా పరాకు మాటలు...? ఇప్పుడు క్రికెట్‌లో టీ.వి. రావటం లేదుగా..." అంది.

అతను చిన్నగా నవ్వి "పరాకు మాటలు నావి కావు నీవే! టీ.వి.లో క్రికెట్ రావటం లేదనటానికి తిరగేసి చెబుతున్నావు"[57] నేనడిగింది నువ్వు చేస్తున్న పరుగుల సంగతి! "అన్నాడు"

***"స్వానుభవం"*** కథలోని ఎత్తుగడ కూడా సహృదయ పాఠకునికి హాస్యాన్ని కలిగించేదే.

"ఆ రోజు అల్లీబిల్లీ వారం

అంటే ఆదివారమన్న మాట. ఆదివారానికి మేము పెట్టుకున్న మరోపేరు అది. మేము అంటే నేను, మా అక్కయ్య కూతుళ్ళు బన్నూ చిన్నూ.

ఒక ఆదివారం నాడు మేం ముగ్గురం ఏదో ఆటలాడుకుంటుంటే, అక్కయ్య" వాణీ–అలా అల్లీబిల్లీ ఆటలాడకపోతే, వాళ్ళిద్దరిని కూర్చోబెట్టి చదువు చెప్పకూడదా?" అంది నాతో.

"ఆదివారం చదువు మాటెత్తకూడదు. హాయిగా ఆడుకోవాలంతే" ఖచ్చితంగా చెప్పేశాను.

"అవును ఇలా అల్లీ బిల్లీ ఆటలే ఆడుకోవాలి" అంది బన్నూ నాకు సపోర్టుగా.

---

**56. తొలిచూపు కథా సంపుటి – గోగినేని మణి – పుట 110**

**57. మనసున మల్లెలు కథా సంపుటి – గోగినేని మణి – పుట 47**

అప్పుడే ఆదివారమంటే అల్లీ బిల్లీ వారం అని పేరు పెట్టుకున్నాం. నేను వచ్చేటప్పుడు బన్నూ, చిన్నూ "మళ్ళీ ఎప్పుడొస్తావు పిన్నీ" అని అడిగితే, నేను – "వచ్చే ఆది..." అని చెప్పబోతుంటే మధ్యలోనే ఆపేసి "తప్పు చెబుతున్నావు" అంటారు. అవునవును "అని సరిదిద్దుకుని" వచ్చే అల్లీ బిల్లీ వారం వస్తా" అనగానే సరదాగా నవ్వేస్తారు."[58]

***"అత్తగారు–కొత్త కోడలు"*** కథలోని ఎత్తుగడ పాఠకునికి కడుపుబ్బా నవ్విస్తూ కథనంలోకి ప్రవేశించేటట్లు చేస్తుంది.

"నీలూ... మా అత్తగారి పిలుపులోని ఘాటుని బట్టి ఆవిడెంత చిరాగ్గా ఉన్నారో అర్థమైంది. చేతిలోని పుస్తకాన్ని పక్కన పడేసి హడావుడిగా వెళ్ళాను. డైనింగ్ హాల్లో కుర్చీలో కూర్చొని వున్న మా అత్తగారు టేబుల్ మీద ఆనించిన చేయిని ఎదురుగా ఉన్న వంటగది గుమ్మం వైపు తిప్పి "ఏమిటే అది...?" అనడిగారు. "కళ్ళజోడు లేదా, ఎక్కడ పెట్టారూ... తెచ్చివ్వనా...?" అన్నాను.

"చదువుకోవటానికే తప్ప కళ్ళజోడు అవసరం లేదు. అన్నీ బాగానే కన్పిస్తాయి. ఎందుకలా అనడుగుతున్నాను..." స్వరంలో పదును ఇంకొంచెం పెరిగింది.

వంటగదిలో నిలబడి వున్న మావారు పూర్వపు యుద్ధరంగంలో కత్తి, డాలు పట్టుకున్న వీరసైనికుడిలా ఒక చేత్తో చాకు, మరో చేతితో సొరకాయ పట్టుకుని చేస్తున్న విచిత్ర విన్యాసాల్ని చూడగానే నాకు నవ్వాగలేదు.

"వంట నేర్చుకోవాలని నేనే చెప్పాను. ముందుగా ఈ వేళ కూరగాయలు తరగటం ప్రాక్టీసు చేస్తున్నారు" సమాధానం చెప్పాను. "కూరగాయలు తరగాల్సిన ఖర్మ వాడికేమిటీ...?" దీర్ఘం తీశారు. "కూరగాయలు తరగటం కర్మ కాదు... క్రియ"

కర్తవు నువ్వేనని కూడా తెలుసు గానీ... ఇంట్లో ఇద్దరాడవాళ్ళం ఉన్నాంగా...?

"ఒకరికి ఇద్దరున్నాం కదానే మీ అబ్బాయికి వంట నేర్పించే సాహసానికి పూనుకున్నాను. నా ఒక్కదాని వల్లాకాదు... మీరు ఓ చేయి వేయాల్సిందే!"[59]

---

**58. మనసున మల్లెలు కథా సంపుటి – గోగినేని మణి – పుట 129**

**59. పిచ్చుకగూడు కథాసంపుటి – గోగినేనిమణి – పుట 151**

## 4.5 నడక :

ఎత్తుగడ నుండి ముగింపు వరకు కథ సాగే పద్ధతి నడక. ఇది సూటిగా ఉండవచ్చు, కథలో ఎన్నో మలపులు తిరగవచ్చు, దేశ కాలాల్లో ఒక నిర్ధిష్ట బిందువు దగ్గర బయలుదేరి పురోగమించవచ్చు, తిరోగమించవచ్చు. ఒక్కొక్కప్పుడు రెండు రకాల గమనాలు చూపించవచ్చు. గోగినేనిమణి తన రచనల్లో ఒక్కో కథలో ఒక్కో విధమైన మలుపును తిప్పారు. ఈ కథలను చదువుతున్నంతసేపు సహృదయ పాఠకుడు తదేకధ్యానంతో చదివే రీతిలో తీర్చిదిద్దారు. పాఠకుడి మనస్సు మరల్చకుండా చేసిందే ఉత్తమ కథాగమనం అవుతుంది. అటువంటి కథలెన్నో రచయిత్రి కలం నుంచి జాలువారాయి. వాటిలో ప్రధానమైన వాటిని కొన్నింటిని పరిశీలిస్తే.

"తొలిచూపు" కథలో కథానాయకుడు రఘు తల్లిదండ్రులు నిశ్చయించిన అమ్మాయి నీరజను చూడడానికి వెళతాడు. అక్కడి నుండి వచ్చిన తర్వాత ఆ అమ్మాయిని కాదని ఆ ఊరిలోనే వేరే అమ్మాయిని చూసి ఇష్టపడతాడు. అందంలోను, ఆస్తిలోను తల్లిదండ్రులు నిశ్చయించిన అమ్మాయి కంటే తక్కువే. అయినా ఎందుకు ఇష్టపడుతున్నాడో కారణం తెలియక సతమతమౌతుంది తల్లి. పాఠకునిలో కూడా ఉత్కంఠను కలిగిస్తూ ఈ కథ యొక్క నడక సాగింది.

"మమతల హారం" కథలో నడక కూడా ఎంతో ఆదర్శవంతంగా, సందేశాత్మకంగా సాగింది. సుమ తల్లికి సుమ అమ్మమ్మ చేయించిన తొమ్మిది పేటల చంద్రహారం తయారీ వెనక చాలా పెద్ద కథ ఉంటుంది. తన తల్లిని గుర్తు చేస్తుందనీ, ఆ ఇంట్లో రెండు తరాల ఆడపిల్లల పెళ్ళి చూపులకు అచ్చొచ్చిందనీ అదంటే సుమతల్లికి అపరిమితమైన అనుబంధం. సుమ భర్త అశోక్ డబ్బు లేక స్కూటర్ కొనడాన్నే వాయిదా వేస్తున్నాడని తెలిసి – "సుమ తల్లి మనుషులకే కాదు, వస్తువులకీ కాలపరిమితి ఉంటుంది." అనుకొని అంత ప్రత్యేకమైన హారాన్ని అమ్మేసి డబ్బు పంపిస్తుంది. స్కూటర్ కొనుక్కొన్నాక ఆ విషయం తెలిసిన అశోక్ అందుకు ఎంతగానో బాధపడి తన శక్తి మేరకు ఒక హారాన్ని చేయించి అత్తగారికి ఇచ్చి మేమడక్కపోయినా మా అవసరం తెలుసుకుని మీ అమ్మగారి జ్ఞాపకంగా ఉన్న హారాన్ని అమ్మేసారు. ఆ జ్ఞాపకాలు అలాగే కొనసాగాలి" అని అంటాడు. అప్పుడది ఆమెకు మామూలు హారంలా కాకుండా మమతల హారంలా కన్పిస్తుంది. సహృదయ పాఠకుడు చదువుతున్నంత సేపు కథలో లీనమయ్యేటట్లు ఈ కథ యొక్క నడక సాగింది.

"అమ్మా మన్నించవూ" కథలోని నడక కరుణరసాత్మకంగా సాగింది. కథలో ప్రధాన పాత్ర అన్నపూర్ణమ్మ తన కొడుకు కేశవరావు చదువు కోసం ఎంతో కష్టపడి, త్యాగాలు చేసి ప్రయోజకుడిని చేస్తుంది. పెళ్ళైన తర్వాత కేశవరావు భార్య మాటకు తల తిప్పే గంగిరెద్దులా మారతాడు. తల్లి దగ్గర చాకలి నరసమ్మ ఉంచిన నాలుగు వేల రూపాయలను అప్పుగా తీసుకుని తిరిగి ఇవ్వడు. అవి తన డబ్బులేనని చాకలి నరసమ్మవి అని అబద్ధమాడుతుందని భార్య చెబితే నిజమేననుకుంటాడు. అన్నపూర్ణ తన చేతి గాజులు అమ్మి నరసమ్మ అప్పు తీరుస్తుంది. కేశవరావు నిజం తెలుసుకునేసరికి అన్నపూర్ణమ్మ మరణిస్తుంది. ఈ కథ చదువుతున్నంతసేపు సహృదయ పాఠకుడికి కన్నీళ్ళు తెప్పించక మానదు.

"ప్రేమలేఖ" కథను రచయిత్రి చాలా చమత్కారంగా నడిపించారు. భార్యాభర్తల మధ్య అనుబంధం, ప్రేమానురాగాలు మనసులో ఉండాలి, చేతల్లో ఉండాలి కాని మాటల్లో కాదని ఈ కథలో చక్కగా తెలియజేశారు రచయిత్రి.

"నేను మంచిదానిని కాదు" కథలో స్త్రీ సహజసిద్ధమైన అసూయను చూపుతూనే స్త్రీలలో ఉండే మానవత్వ భావనను ప్రభావతి పాత్రలో చూపిస్తూ కథనాన్ని నడిపించారు రచయిత్రి.

"అతిథి దేవుడు" కథలో పేరు దేవుళ్ళే గాని దయ్యాల్లా వచ్చి మీద పడే అతిథుల గురించి, వారి వల్ల ఇంట్లో ఇల్లాళ్ళుపడే పాట్లను కళ్ళకు కట్టినట్లు చూపారు.

"నైన్..ఒన్...ఒన్" కథలో గుండెను బరువెక్కించే ఓ పసివాడి ఆవేదనను అంతర్లీనంగా తెలియజేస్తూనే కథను చాలా చమత్కారంగా నడిపించారు రచయిత్రి.

"కొత్త అనుభూతి" కథలో గ్రామీణ వాతావరణంలోని ఆప్యాయతానురాగాలను కళ్ళకు కడుతూ కథ కొనసాగుతుంది.

"మొగలిపువ్వు" కథలో కథానాయకుడు విశ్వనాథ సత్యన్నారాయణ, కథానాయిక వినుత. కథ మొత్తం నాయికాపరంగా నడుస్తుంది. వినుత విశ్వనాథ సత్యన్నారాయణను ప్రేమించి పెళ్ళి చేసుకుంటుంది. కానీ పెళ్ళి తర్వాత అతనిలో ప్రేమ కన్పించదు. వినుతకు భర్త ప్రవర్తన నచ్చక బాధపడుతుంది. తను ప్రేమించినవాడు ఎలా ఉండాలో డైరీలో రాస్తుంది. అది చదివిన విశ్వనాథ సత్యన్నారాయణ భార్యను అపార్థం చేసుకుంటాడు. కానీ ఆమె ప్రేమించిన వ్యక్తి తనేనని తెలుసుకుని పశ్చాత్తాపపడతాడు. చమత్కార ధోరణిలో కథనాన్ని నడిపించి రచయిత్రి పాఠకులను ఆకట్టుకొన్నారు.

“ఎదురుచూపు” కథలో మనుషుల బాధ్యతారాహిత్య ప్రవర్తన వలన, దాని వలన సమాజానికి కలిగే హాని ఎలా ఉంటుందో తెలియజేశారు. “చుక్కమ్మ” కథను ఉత్తరాంధ్ర గ్రామీణ యాసలో నడిపించారు. అక్షరజ్ఞానం లేని గ్రామీణ యువత ఉన్నతంగా ఆలోచించి మెట్టింటి, పుట్టింటి మధ్యవారధిగా నిలుస్తుంది.

“విజ్ఞాపన” కథను ఒక కొత్త కోణంలో నడిపించారు రచయిత్రి. మగవారితో పాటు ఆడవారిక్కూడా సమాన హక్కులు ఉండాలి కాని మగవాళ్ళు చేసే చెడ్డ పనుల్లో కూడా సమానహక్కులు కోరుకోకూడదని అంశంతో కథ నడుస్తుంది.

‘‘ఖజానా’’ కథలో నిజమైన సంపద అంటే మనుషుల మధ్య ఉండే ఆప్యాయతానురాగాలేనని తెలియజేస్తారు రచయిత్రి. కుటుంబ సభ్యుల మధ్య ఆప్యాయతా, అనురాగం ఒకరికొకరు అర్థం చేసుకునే శక్తి ఉంటే ఎలాంటి కష్టాన్నయినా అధిగమించ వచ్చనే కథనంతో నడుస్తుంది.

“ఎదురుదాడి” కథలో పిల్లల మీద పెద్దలు ఒత్తిడి చేస్తే జరిగే దుష్పరిణామమేమిటో తెలియజేసారు.

“పాలవెల్లి” కథలో అన్నదమ్ముల మధ్య ఉండవలసిన అవగాహన గురించి తెలియజేస్తూ కథనాన్ని నడిపించారు.

“భోధి వృక్షం నీడలో” కథలో సమాజానికి నిజమైన సేవ చేయాలనుకునేవాడు ఎలా ఉండాలో తెలియజేసారు.

“విలువలు” కథ నైతిక విలువలకు కట్టుబడే తండ్రి, విలువలు పాటించకుండా ధనాన్ని కూడబెట్టాలనుకునే కొడుకుల మధ్య సంఘర్షణగా నడుస్తుంది. కథనాన్ని తనదైన శైలిలో చక్కగా నడిపించారు రచయిత్రి.

“ఇంటర్వ్యూ” కథలో పల్లెటూరి స్వచ్ఛమైన మనుషుల, మనసుల ఆప్యాయతా, అనురాగాలు ఎలా ఉంటాయో తెలియజేశారు.

ఇలా చెప్పుకుంటూ పోతే ఒక్కో కథ ఒక ప్రత్యేకమైన నడకతో సాగింది. రచయిత్రి రాసిన కథలన్నీ సమకాలీన సమాజంలోని సామాన్య జీవితాల్ని నిశితంగా పరిశీలించి రాసినవే. కథలకు జీవితమే ప్రేరణ. జీవితం నుంచే కథలు పుట్టుకొస్తాయి. జీవితాన్ని

వివిధ కోణాల నుంచి పరిశీలించినప్పుడు మంచి కథలు బయటకు వస్తాయి. జీవితంలో సున్నితమయిన కోణాలను స్పశించి రాసే కథలు మంచి కథలుగా గుర్తించబడతాయి. ఈ లక్షణం గోగినేని మణిగారి కథల్లో ఉండి సహృదయ పాఠకులను ఆకట్టుకొన్నాయి.

## 4.6 ముగింపు :

కథకు ముగింపు ప్రాముఖ్యం ఎక్కువ. చక్కటి ముగింపు ఉంటేనే సహృదయ పాఠకుడు సంతృప్తి చెందుతాడు. కథ ముగింపు పాఠకునికి ఆలోచింపచేసేటట్లు ఉండాలి. అప్పుడే అది మంచి ముగింపు అవుతుంది. గోగినేని మణి గారి కథల్లో కొన్ని ముగింపులను పరిశీలిద్దాం. రచయిత్రి గోగినేని మణి తన కథల్లో ఒక్కొక్క కథను ఒక్కో వైవిధ్యభరితమైన ముగింపును పలికి రచనా శిల్పంలో తనదైన ప్రత్యేకతను చాటుకున్నారు. వాటిలో ప్రధానంగా తొలిచూపు కథ ముగింపులో కథానాయిక శారద తన భర్త రఘు ఆమె పట్ల పెంచుకున్న నమ్మకాన్ని ఎప్పటికీ వమ్ము చేయనని పలుకుతుంది.

"మీరు ఆ మొదటి క్షణంలో నాలో చూసిన మానసిక సౌందర్యాన్ని చెదరిపోకుండా జీవితాంతం కాపాడుకుంటాను"[59] అని కథలోని పాత్రచే ముగింపు పలికారు ఈ కథలో రచయిత్రి. ఈ ముగింపు పాఠకునికి కథలో లీనమయ్యేటట్లు చేసింది.

***"ప్రేమలేఖ"*** కథ ముగింపులో భర్త రాసిన లేఖను చూస్తూ మురిసిపోతుంది అరవింద. రచయిత్రి ఈ కథను కవితాత్మకంగా ముగించారు. "ఈ ఉత్తరంలో అందమైన భాషలేదు. అయితేనేం, ప్రేమ ఉంది. మనసు ఉంది... నాకోసం తపన ఉంది! నాకీ ప్రేమలేఖ చాలు!' సూట్‌కేసులో ఆ ఉత్తరాన్ని జాగ్రత్తగా దాచుకుంటూ తృప్తిగా, ఆనందంగా అనుకుంది అరవింద. అలా అనుకోగానే ఆమె మనసులో అప్పుడు మొదలైంది 'మొగలిపూల గాలి ముత్యాలవాన".[60]

**"గాజులు తొడిగిన చెయ్యి" కథలో ముగింపు ఆలోచింపచేస్తుంది.**

"ఆ రోజే నేనొక విషయం తెలుసుకున్నాను... ఏ మగవాడైనా తన పౌరుషం గురించి చెప్పుకునేటప్పుడు నేనేం గాజులు తొడుక్కోలేదు' అనే మాటని ఉపయోగించటం

---

**59. తొలిచూపు కథా సంపుటి – గోగినేని మణి – పుట 14**

**60. తొలిచూపు కథా సంపుటి – గోగినేని మణి – పుట 21**

సరికాదని అవును.. లాలించే గాజుల చేతులు అవసరమైనప్పుడు మగవాడికంటే కూడా దృఢంగా కొరడాని ఝుళిపించగలవు మరి!" [61]

**"నేను మంచి దానిని కాదు"** కథ ముగింపులో ప్రభావతి పాత్రలో పశ్చాత్తాపం కలుగుతుంది. తన అత్త పట్ల తాను ప్రవర్తించిన తీరుకు బాధపడుతుంది. అత్త మనసు యొక్క ఔన్నత్యాన్ని తెలుసుకుని కుంగిపోతుంది. ఈ ముగింపు సహృదయ పాఠకుని హృదయంలో కలకాలం నిలిచి పోతుంది.

"ఒద్దు... నాకే కానుకలూ వద్దు. అత్తయ్య నన్ను గుర్తించలేదనీ, అభిమానించలేదనీ అపోహ పడ్డానే తప్ప.... ఇంకేమి ఆశించలేదు! ప్రేమగా ఇచ్చినా తీసుకునే అర్హత నాకు లేదు! సేవలు చేసినా గానీ చివరి రోజుల్లో మనస్ఫూర్తిగా చేయలేకపోయాను... మనసులో కోపం పెట్టుకునే చేసాను.. నిజంగానే నేను మంచివాన్ని కాదు..." అంటూ ఆవేశంతో ఆ కాగితాలను చింపేసి, మోకాళ్ళలో తలదాచుకుని గుండెలలిసేలా రోదిస్తున్న ప్రభావతిని ఎలా అనునయించాలో తెలియనట్లుగా రాగవరావు విభ్రాంతిగా చూస్తుండిపోయాడు."[62]

**బాంధవ్యాలు కథలోని ముగింపు సందేశాత్మకంగా ముగిసింది.**

"రంగస్థలం మీదకు కొన్ని పాత్రలు ఇలా వచ్చి అలా వెళ్ళిపోతుంటాయ్! వాటి నిడివి చాలా తక్కువ ఉంటుంది. జీవితంలోనూ అంతే కొందరితో ఏర్పడే బంధుత్వాలకూ, బాంధవ్యాలకూ ఆయుష్షు ఎంతో ఉండదు! అలాంటి వాటి కోసం మదనపడటం కంటే మర్చిపోగలగటమే ఉత్తమం! ఈ విషయాన్ని గ్రహించి సుమిత్ర తొందరగానే తన మనసును స్థిమిత పరుచుకున్నందుకు నేనూ తేలికగా నిట్టూర్చాను."[63]

**"అమ్మా మన్నించవూ" కథలోని ముగింపు పాఠకునికి ఆలోచింపచేస్తుంది. పాఠకుని హృదయం కన్నీటితో బరువెక్కుతుంది.**

"తల్లి తీక్షణమైన చూపులోని ఆ ప్రశ్నలు వాడి బాణాలై గుండెకు గుచ్చుకోగా కేశవరావు తప్పు తెలుసుకుని విలవిలలాడిపోయాడు. 'ఇంట్లో డబ్బు వుంది. ఇప్పుడే నీకు ఇస్తాను. రేపే నేను నీ చేతులకు గాజులు చేయిస్తాను. పొరపాటు జరిగిందమ్మా' ఆవేశంగా

---

**61. తొలిచూపు కథా సంపుటి – గోగినేని మణి – పుట 43**

**62. తొలిచూపు కథా సంపుటి – గోగినేని మణి – పుట 82**

**63. తొలిచూపు కథా సంపుటి – గోగినేని మణి – పుట 109**

లేచాడు. చెక్క బీరువానే లాగి పడేసి సరితతో అన్నాడు. "ఇది ఇక్కడ తీసి పడెయ్యి. ఈ ఇల్లు ఒక్కటిగానే ఉండాలి!" కొడుకు మాటలకు అన్నపూర్ణమ్మ పెదవులపై చిరునవ్వు వెలిగింది. అవును! ఒక్కటిగానే ఉంటుంది. ప్రశాంతంగా నిదురపోతున్న తల్లిని చూసి కేశవరావు కొయ్యబారిపోయాడు. చేతిలోని నోట్లు చెల్లాచెదురై అన్నపూర్ణమ్మ నిండా పరుచుకున్నాయి.

"అమ్మా... అమ్మా... నన్ను మన్నించవూ...!" అతని ఆక్రోశం ఆకాశం అంచులను తాకుతోంది."[64]

**"ఎన్నిక" కథలో**

"నాన్నా, నీకు తగిన రాజకీయ వారసుడిని అల్లుడిగా ఎన్నిక చేశావు నువ్వు, కానీ నా ఓటు సంతృప్తికరమైన జీవితానికే. అందుకే చంద్రం బావతో వెళ్తున్నాను. ఎల్లుండి ఇద్దరం దంపతులమై వస్తాం, ఆశీర్వదిస్తావని ఆశిస్తాను" అని తులసి పాత్రతో లేఖా పద్ధతి ద్వారా ముగింపు పలికారు.

**"కొత్త అనుభూతి" కథ ముగింపులో ఉత్తరాల యొక్క ప్రాధాన్యత గూర్చి నేటి తరానికి తెలియజేశారు...**

"ఇలా ఎన్నో ఉత్తరాలు... ఎన్నెన్నో అనుభూతులు!! ఉత్తరాలు రాయటం, చదువుకోవటంలోని అనుభూతిని మాతరం వాళ్ళు మర్చిపోతున్నారు. మీతరం వాళ్ళకి అసలే తెలయదు! నా దగ్గరున్న ఉత్తరాలను కదిలించి, ఆ అత్తరు పరిమళాన్ని నీకు చవిచూపించాలనీ... నీకు తెలియని కొత్త అనుభూతిని పరిచయం చేయాలనే ఈ ఉత్తరం రాశాను. అర్ధమైందిగా! – మీ అమ్మ."[65]

**"మనసున మల్లెలు" కథను రచయిత్రి కవితాత్మకంగా ముగించారు.**

"వసంత నిలువెత్తున ఎగిసిన కెరటంలా అందమైన ఆవేశంతో అతణ్ణి చుట్టేసి, భుజంపై తలవాల్చి, మనసున మల్లెల మాలలూగిన మధురానుభూతితో మెల్లగా చెప్పింది. "ఇలాంటి ముచ్చటైన క్షణాలకంటే నేను కోరుకునే కానుకలంటూ ఏమీ ఉండవు!"[66]

**64. తొలిచూపు కథా సంపుటి – గోగినేని మణి – పుట 124**

**65. మనసున మల్లెలు కథా సంపుటి – గోగినేని మణి – పుట 23**

**66. మనసున మల్లెలు కథా సంపుటి – గోగినేని మణి – పుట 40**

**"గెలుపునాది కథ"లో ముగింపు ఉత్కంఠతో ముగించారు.**

"అవునూ, ఆ ఉత్తరంలో నవరత్నాలు అంటూ వ్రాశావేమిటీ? ఆరా తీసింది దుర్గాంబ! గీత కిలకిలా నవ్వేసి అక్కడ నుండి పారిపోయింది. 'సమాధానం చెప్పకుండా అలా నవ్వుతూ పారిపోయిందేమిటి చెప్మా...' బుగ్గన వేలేసుకుని ఆశ్చర్యంగా చూస్తూండిపోయింది దుర్గాంబ"[67]

**"అందం" కథలో ముగింపు సందేశాత్మకంగా ఉంది. రచయిత్రి ఈ ముగింపులో మనిషికి అందం కంటే వ్యక్తిత్వం గొప్పదని తెలియజేశారు.**

"సాహసం, చురుకు, తెలివితేటలు కలిగిన ఆ అమ్మాయి క్రొత్తవాళ్ళకేమోగానీ, పరిచయస్తులకు తన విశిష్ట వ్యక్తిత్వంతో అందంగా కనిపించటంలో ఆశ్చర్యమేముంది!"

ఎక్కడో చదివిన ఓ వాక్యం నాకు గుర్తుకొచ్చింది. "అందం స్వభావ లోపాన్ని పూరించలేదు. కానీ మంచి స్వభావం అందం లేని లోపాన్ని పూరిస్తుంది!"[68]

**"కలిసిన హృదయాలలోన" కథలో ముగింపు కూడా సందేశాత్మకంగానే చిత్రించారు రచయిత్రి.**

"పిల్లలను ప్రేమించే తల్లిదండ్రులు అందరికీ ఉంటారు. కానీ అంతే ప్రేమగా, బాధ్యతగా స్పందించే పిల్లలు కొంతమంది అదృష్టవంతులైన తల్లిదండ్రులకే ఉంటారు. మేమూ అలాంటి అదృష్టవంతులమైనందుకు చాలా చాలా ఆనందంగా ఉంది!"[69]

**"స్వానుభవం" కథలోని ముగింపు కూడా సందేశాత్మకంగానే చిత్రించారు రచయిత్రి.**

"తమకి ఇతరుల వలన జరిగిన అన్యాయానికి బాధపడతారే కానీ తమ వల్ల ఇతరులకి కలిగిన అన్యాయాన్ని ఎవరూ గుర్తించటానికి ఇష్టపడరు. అలాంటి ఆలోచనే రాదు చాలామందికి ఆరోజు నేను చెప్పబోతుంటే "నీకేం తెలుసని అక్కయ్య వినిపించుకోలేదసలు. ఇప్పుడు తను చేసిన పని ఎలాంటిదో గ్రహించగలిగింది. ఎవరికైనా స్వానుభవమే మంచి గురువు"[70]

---

**67. మనసున మల్లెలు కథా సంపుటి – గోగినేని మణి – పుట 74**

**68. మనసున మల్లెలు కథా సంపుటి – గోగినేని మణి – పుట 78**

**69. మనసున మల్లెలు కథా సంపుటి – గోగినేని మణి – పుట 106**

**70. మనసున మల్లెలు కథా సంపుటి – గోగినేని మణి – పుట 134**

**"తానొకటి తలిస్తే" కథను శీర్షికతో ఉత్కంఠగా ముగించారు రచయిత్రి గోగినేని మణి.**

"ఆలోచించండి అనే కథ చాలా బావుంది సుందరమ్మా. ఈ కథలో కోడలు జానకి అత్తగారి గయ్యాళితనం వల్ల ఎలా మూగబాధ అనుభవించిందో చదువుతూంటే కళ్ళు చెమర్చాయి. నిజంగా నాకు! మాకోడలు ఏదో చిన్న మాట అంటేనే మనమేదో ఆవిడని హింసించేస్తున్నట్లుగా మొహం పెట్టేస్తుంది. ఈ కథని మా కోడలితో చదివిస్తే గానీ, నేను తనని ఎంత బాగా చూసుకుంటున్నానో, లోకంలో ఎంతెంత కష్టాలు పడేవాళ్ళున్నారో అప్పుడు గానీ తెలిసిరాదు" అంటూ భాస్కరాంబ అంటున్న మాటలు చాటుగా వింటున్న కోడలు కమల షాక్ తగిలిన దానిలా బిగుసుకుపోయింది. ఇదేమిటి ఇలా జరిగింది? తానొకటి తలిస్తే... అత్తగారు మరొకటి తలుస్తోందా...?!"[71] అంటూ ముగించారు.

**"అమ్మకావాలి" కథ ముగింపు సమాజంలోని సగటు తల్లిదండ్రులకు హెచ్చరికలా ఉంది.**

"తల్లిదండ్రుల లాలనలో అపురూపంగా గడచిపోవాల్సిన బంగారు బాల్యాన్ని హాస్టల్ గదికి తాకట్టు పెట్టడం నిజంగా నేరమే! ఈ విషయాన్నే చిట్టితల్లి హాస్టల్ నుండి వచ్చేసి తన ప్రవర్తన ద్వారా తమకు చెప్పకనే చెప్పింది! పది సంవత్సరాలలోపు పిల్లలను హాస్టలులో చేర్చుకోకూడదనే నిబంధన ఉండాలసలు! 'మనసులోనే మౌనంగా రోదిస్తూ అనుకున్నాడు రామారావు!" ఆ తల్లిదండ్రుల మానసిక స్థితిని గమనించినట్లుగా, గాలి కూడా ఆగి ఆగి జాలాజాలిగా వీస్తోంది"[72]

**"ఎదురుచూపు" కథలోని ముగింపు డబ్బే అన్నింటికి ప్రధానమని నమ్మిన కొడుకును మందలిస్తూ తల్లి చేసిన హితబోధ సహృదయ పాఠకుని హృదయంలో ఈ ముగింపు కలకాలం నిలిచిపోతుంది.**

"ఏ గిన్నెలో ఉంటేనేమి గానీ, రుచికరమైన పాయసమే ముఖ్యమని నేననుకుంటాను. మీకు మాత్రం అది అందమైన, ధగధగలాడే వెండిగిన్నెలో ఉండాలి. రుచితో పట్టింపులేదు. నేనలా రాజీపడలేక అక్కడ ఉండలేక ఇక్కడికి వచ్చేశాను. మీ జీవన సరళి అంతేనని, చేయగలిగింది ఏది లేదనీ నువ్వనుకుంటే... సరే, చేసేదేం లేదు. కానీ చిన్నా... నా కోరిక ఏమిటంటే నువ్వొక్కసారి వెనక్కి తిరిగి చూసుకో... నువ్వు సంపాదించిన దానికంటే..

---

**71. మనసున మల్లెలు కథా సంపుటి – గోగినేని మణి – పుట 140**

**72. మనసున మల్లెలు కథా సంపుటి – గోగినేని మణి – పుట 149**

పోగొట్టుకున్నదే ఎక్కువనీ, అదే అమూల్యమైనదని మీకర్థమవుతుంది. గతంలోనే ఆలోచనలు ఎలా ఉండేవో గుర్తు చేసుకుని... పగ్గాలు చేత పట్టుకొని, నీ ఇంటిని అందమైన పూలతోటలా తీర్చిదిద్దే ప్రయత్నం మొదలుపెట్టాలనుకుంటే, నువ్వు తప్పకుండా సాధించగలుగుతావు.. సాధిస్తావు... నీగురించి నాకు తెలుసు!!

చివరగా ఒక మాట... నా ఉద్దేశ్యం అర్ధమైందిగా.. అలాంటి పూలతోట లాంటి మీ ఇంటికి రమ్మనే నీ పిలుపుకోసం నేను ఆశగా ఎదురుచూస్తుంటాను."[73]

**"విజ్ఞాపన" కథలోని ముగింపు కూడా నేటితరం అమ్మాయిలకు చేసిన విజ్ఞాపనలా ఉంది.**

"మీతరం అమ్మాయిలందరికీ నేను చేస్తున్న విజ్ఞప్తి ఏమిటంటే... మీ ప్రత్యేకతల్ని వదులుకోవటానికి సిద్ధం కాకండి. అదే సమయంలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు వక్రభాష్యం చెప్పుకోకండి, మగవాళ్ళతో మీరు అన్నింటిలో సమానమే! వాళ్ళకున్న అన్ని హక్కులూ మీకూ ఉండి తీరాలి... నిజమే! కానీ చెడిపోవటంలోనూ సమానహక్కుల్ని మాత్రం కోరకండి... ఆ పోటీ మీకొద్దు.

ఎంతో ఉద్వేగంతో మాట్లాడిన ఆమె కంఠం చివరకు వచ్చేసరికి అర్థిస్తున్నట్లుగా ఆర్ద్రంగా మారిపోయింది. ఆమె మాటల్ని విన్న అమ్మాయిలందరూ అవాక్కయి ఒక క్షణం అలాగే చూస్తూండిపోయారు.

తరువాత ఆ మాటల్ని అంగీకరిస్తున్నట్లుగా తలలూపి, కంపార్ట్‌మెంట్ వైపు అడుగులు వేస్తున్న ఆమెకు చేతులూపుతూ చిరునవ్వుతో వీడ్కోలు పలికారు."[74]

**"ఖజానా" కథను రచయిత్రి కవితాత్మకంగా ముగించారు.**

*"నవ్వు... నరుడికి నారాయణుడిచ్చిన నజరానా!*
*నవ్వులు పండే ఇల్లే నిండు ఖజానా!"*[75]

---

**73. మొగలిపువ్వు కథా సంపుటి – గోగినేని మణి – పుట 32**

**74. మొగలిపువ్వు కథా సంపుటి – గోగినేని మణి – పుట 53**

**75. మొగలిపువ్వు కథా సంపుటి – గోగినేని మణి – పుట 85**

**"కీడెంచి" కథలోని ముగింపు కూడా సమకాలీన సమాజానికి ఒక మేలుకొలుపుగా చిత్రించారు రచయిత్రి.**

"కొందరికి తన వారిలో తప్పులు కనిపించవు. ఎదుటి వారిలో మాత్రం ఒప్పులు కూడా తప్పులుగానే అన్పిస్తాయి. అదీ ఓ రోగ లక్షణమే. వ్యాధి ముదరకముందే మందు వేయాలి. పిన్ని మనసు నొచ్చుకుంటుందేమోనని ఉపేక్షించి ఊరుకోకూడదు అనుకున్న స్వర్ణ – అయోమయంగా చూస్తున్న కామేశ్వరితో స్థిరంగా చెప్పింది. "నిజమే పిన్నీ, మన వాళ్ళు కీడెంచి మేలెంచమని చెప్పారు. అంటే ఏ విషయన్నైనా రెండు రకాలుగానూ ఆలోచించుకోమని అర్థంగానీ, అన్నింటికి కీడు మాత్రమే ఎంచమని కాదు గదా! అందరిలోనూ చెడుని మాత్రమే చూడటం చేటు తెస్తుంది. మంచిని మంచిగా చూడుటమనేది మన మనసుకూ మంచిది... మేలూ చేస్తుంది!"

ముల్లు గుచ్చుకున్నట్లుగా చురుక్కుమంది కామేశ్వరికి 'ఇదేమిటి, గుడ్డొచ్చి పిల్లను వెక్కిరించినట్లుగా తనకే చెబుతోంది. చిన్నప్పటి నుండీ తెలిసిన పిల్లేనా...! తలెత్తి స్వర్ణ వైపు విభ్రాంతిగా చూసింది"[76]

**"గాయం" కథలో ముగింపు ఒక నీతి బోధలా ఉంది.**

"మనం తప్పు చేశామని అనిపించినపుడు భేషజం లేకుండా ఎవరినైనా క్షమాపణ అడగటం మంచి పద్ధతి. అలాగే నిరాధారమైన నిందారోపణను మౌనంగా సహించి ఊరుకోకుండా నిజాన్ని నిర్భయంగా చెప్పటం కూడా అంతే మంచి పద్ధతి."[77]

**"విలువలు" కథ ముగింపులో మనిషికి ఆత్మీయతానుబంధాలే నిజమైన ఆనందాన్నిస్తాయని తెలియజేసారు రచయిత్రి. ఆస్తిపాస్తులకు ప్రాధాన్యమిచ్చే నేటి సమాజానికి ఈ ముగింపు ద్వారా హితవు పలికారు.**

ఈ విధంగా ప్రతీ కథలోని ముగింపును వైవిధ్యభరితంగా చిత్రించి రచయిత్రి తన రచనా కౌశలాన్ని చూపించారు.

---

**76. మొగలిపువ్వు కథా సంపుటి – గోగినేని మణి – పుట 109**

**77. మొగలిపువ్వు కథా సంపుటి – గోగినేని మణి – పుట 124**

గోగినేని మణి తన రచనాశిల్ప నైపుణ్యం ద్వారా పాత్ర చిత్రణలోను, కథాకథన శైలిలోను, శీర్షికా వైవిధ్యంలోను, ఎత్తుగడలోను, నడకలోను, ముగింపులోను తనదైన ప్రత్యేకతను ప్రదర్శించి ఆధునిక కథారచయితలలో తనకంటూ ఒక స్థానాన్ని కైవసం చేసుకోగలిగారు. తరువాత వీరి కథల్లో ఉన్న భాషా విశేషాలను గూర్చి ఐదవ అధ్యాయంలో చర్చించడం జరిగింది.